# తానొకటి తలిస్తే

## కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు

"నాయనా రాఘవా! నీ పెళ్లి చూసే యోగం మాకు లేదంటావా? ముప్పై ఏళ్లు దాటిపోతున్నా నీకు పెళ్లి ధ్యాసే లేదాయె! సంబంధాలంటూ వచ్చినవాళ్లు వచ్చినట్టు తిరిగి వెళ్లిపోతున్నారు" రాఘవరావు తల్లి కాంతమ్మ తన గోడు చెప్పుకు-పోతోంది

"అమ్మా! యిలా నువ్వు పెళ్లి ప్రస్తావన తీసుకు రావటం నేను కాదనడం పరిపాటి అయిపోయింది. నువ్వన్నట్టు ఆ కళ్యాణం ఘడియ రావాలిగా"

"అలా అంటే ఎలారా? ఎదిగిన నీ తోబుట్టువుల సంగతైనా నువ్వు ఆలోచించాలి. నీకొచ్చిన కట్నం సొమ్ముతో వాళ్లకు పెళ్లిళ్లు చెయ్యాలి. నువ్వు యిలా సంబంధాలు చెడగొడుతూ వుంటే వాళ్ల గతేంకాను"

"నా కట్నం డబ్బుతో వాళ్ల పెళ్లిళ్లు చెయ్యాలనుకోవడం దురాశ అని నేను అనను కాని అన్యాయం అని అంటాను నా కట్నంతో వాళ్ల పెళ్లిళ్లు చేసి నన్ను అప్పుల్లో ముంచెత్తటం ఏమంత సబబు కాదేమో అవి తీర్చే శక్తి నాకెక్కడుంది?"

"నీకున్నంత ముందు చూపు మాకు లేదురా అదే వుంటే మీ నాయన సంపాదనంతా నీ చదువులకు ధారపోసే వాళ్లమే కాదు కూడబెట్టి వాళ్ల పెళ్లిళ్లు చేసి బరువు దింపుకొనే వాళ్లం".

'అది కాదమ్మా నేను యిలా త్యాగాలు చేసు కుంటూపోతే రేపు నా గతేంకాను నేనూ మీలానే పిల్లల్ని బరువు అనుకోవాల్సి వస్తుందిగదా. వాళ్లను చదివించాలన్నా సరైన సంబంధాలు చూడాలన్నా ఆర్థిక స్తోమతంటూ ఉండాలిగా"

"నిజమే నాయనా మీ తరం వేరు ముందు చూపున్న వాళ్లు. ఇహ మా తరం అంటావా! వర్తమానంతో సతమతమవటం తప్పితే భవిష్యత్తు గురించి ఆలోచించే అవకాశమే లేదు నీ యిష్టం నువ్వు పెళ్లే చేసుకుంటావా, నీ చెల్లెళ్లను కన్యలగానే ఉంచేస్తావో నీదే భారం నాన్న సంపాదనే ఉంటే నీ మీద బరువు మోపేవాళ్లం కాదు ఆకాలంలో రిటైరైపోవడం వల్ల నిన్ను యిబ్బంది పెట్టాల్సి వస్తోంది" అంటూ కాంతమ్మ వాపోయింది.

'నేనూ కసాయివాడ్ని కాదమ్మా నా స్వార్థం కోసం యితరులను బలి చెయ్యాలనేటటువంటి దురుద్దేశం లేదు కానైతే నాకు నచ్చేనాలుగు రాళ్లతో నేను పెళ్లి చేసుకొని సంసారమే ఈదుతానా, అప్పులే తీరుస్తానా? నువ్వు చూస్తూనే వున్నావుగా. పదో, పదిహేనో వేలు ఖర్చు పెట్టి ఆడపిల్ల వాళ్లు తమ బరువు దింపుకుంటారు. కాని జీవితాంతం వాళ్లను పోషించే భారం మొగవాళ్లదేగా'

'చాలా విడ్డూరంగా మాట్లాడుతున్నావురా వెనకటి ఎవడో చెప్పినట్టు ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారమట భార్యా ఓ బరువేనంటావా?

'బరువు అని నువ్వు ఒప్పుకోక పోయినా నిజానికి అది భారమే. నేను సంపాదించే వెయ్యి రూపాయిలు ఏ మూలకు వస్తాయి. పెళ్లయిం దగ్గర్నుంచి ఆ ఖర్చులు ఈ ఖర్చులు వచ్చి పడతాయి. ఆ తరువాత పిల్లలూ, రోగాలూ, రొష్టులూ ఆ పైన చదువు సంధ్యలు నా ఒక్క సంపాదనతో వీటిల్ని తట్టుకో గలనా?"

"అయితే ఇంతకి నువ్వు పెళ్లి చేసుకోనంటావు. అంతేగా?"

అలా అని నేనటంలేదు. కానీ గుడ్డెద్దు చేలో పడ్డట్టు చెయ్యలేను అలా చేస్తే, నా జీవితము నరకమవుతుంది అందుకే బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను. ఉద్యోగము చేసే పిల్ల నయితే కాస్త వేడి నీళ్లకు చన్నీళ్లు తోడైనట్లుంటుంది. గుట్టుగా రోజులు గడుప వచ్చు"

"దానికి మా అభ్యంతరం ఏముంటుంది నిక్షేపంగా ఉద్యోగం చేసుకొనే అమ్మాయిని చేసుకో అయితే మా సంగతంటావా ఆడది గడప దాట కూడదు' అనే పంథాలో బతికాం అందుకని ఉద్యోగం చేసే అమ్మాయిని కోడలిగా తెచ్చుకుంటే మనవాళ్లు నలుగురూ నాలుగు మాటలూ అనొచ్చు ఆడదాన్ని పోషించలేక ఉద్యోగం చేసేదానికి కక్కుర్తిపడ్డావు అని నిన్నూ అనొచ్చు ఆ బరువు సులువులు నువ్వే ఆలోచించు రాఘవరావు తల్లి పైకి ఒప్పుకుంటున్నా లోపల ఆమెకు మనస్కరించటము లేదు

నలుగురూ అనుకుంటారని నేను నరకంలోకి దూకలేను మారుతున్న కాలంతోపాటు మనమూ మారాలి ఉద్యోగం చేసినంత మాత్రాన ఆడదానికి సంఘంలో విలువ తగ్గిపోదు. అందుకే నేను అలాంటి సంబంధాన్నే యిష్టపడతాను నాన్నకు కూడా నువ్వు నచ్చచెప్పు అంటూ రాఘవరావు తన నిర్ణయాన్ని గట్టిగా చెప్పేసాడు

పిల్లవానికి పెళ్లి ఓ యింటివాడైతే చాలని ఒక ప్రక్క ఆ వచ్చే కట్నంతో కాలు చెయ్యి కూడగట్టుకుని ఆడపిల్లలకు పెళ్లిళ్లు చెయ్యొచ్చు అనే ఆలోచన మరో ప్రక్క రావడంతో రాఘవరావు తండ్రి అలాంటి సంబంధానికి ఒప్పుకున్నాడు రాఘవ పట్టు పట్టకపోతే నిజానికి ఆయన చదువు సంధ్యలు లేని అమ్మాయినే యిష్టపడేవాడు. చదువుకొని ఉద్యోగం చేసే కోడలు అత్తమామలను అంతగా పట్టించుకోదు అది అతని అభిప్రాయము

* * *

రాఘవరావుకు పెళ్లి అయింది. సరోజ చాలా చురుకైన పిల్ల అమ్మాయికేమి లోపంలేదు మంచి ఆఫీసులో ఉద్యోగం చేస్తోంది జీతం నెలకు ఎనిమిది వందలు. అందరూ సంతోషించారు అందరికన్నా రాఘవరావే ఎక్కువ సంతోషించాడు

దానికి కారణం లేకపోలేదు. తను ఓ బడిపంతులు గురువు దైవం లాంటివాడు. గురువును పూజింపుము అనే మాటలు ఎన్ని చెప్పినా సమాజంలో ఉపాధ్యాయుడికి ఓ హోదా అంటూ లేదు ఒక ప్రత్యేక గుర్తింపు లేదు ఇహ పెళ్లిళ్ల సంగతికి వస్తే సరేసరి. పంతుల్ని పెళ్లి చేసుకోవడం ఆడది న్యూనతగా భావిస్తుంది ఆఫీసులో ఉద్యోగం చేసే ఓ చిరుద్యోగికంటే ఎక్కువ సంపాదిస్తున్నా పంతులుకు విలువ తక్కువే ఆడవాళ్లు

గుమాస్తాలకే ఓటు వేస్తారు వాళ్ళ ఆయన ఓ పెద్ద ఆఫీసులో పనిచేస్తున్నాడంటే స్టేటస్‌గా



ఫలవుతారు. అందుకే రాఘవరావు ఉద్యోగం చేస్తున్న సంబంధం దొరకదేమోనని భయపడ్డాడు ఒకవేళ దొరికినా ఆమె మరో పంతులమ్మవుతుందేమోనని భయపడ్డాడు భార్యా భర్తలిద్దరూ ఓచరు ఉద్యోగం చేస్తుంటే యిల్లు ఓ బస అవుతుందని రాజకీయాలకు నిలయం అవుతుందని అతని భయం అలాకాక సరోజ దొరకటం వల్ల అతను చాలా సంబరపడిపోయాడు

పెళ్ళైన నెల రోజులకే రాఘవకు కొన్ని నిజాలు తెలిశాయి అతను ఆశించిన స్వర్గం చాలా దూరమైంది అతని అంచనాలు తారుమారయ్యాయి

"సరోజ! నువ్వు ఈ నిజం ఎందుకు దాచావు"

అప్పుడే చెప్పొచ్చుగా" రాఘవ ముఖానికి గంటు పెట్టుకున్నట్టు అన్నాడు.

"మీరడిగిన విషయాలన్నిటికి మా వాళ్ళు సరిగానే సమాధానం చెప్పారు ఈ విషయం మీరడగనూ లేదు వాళ్ళు చెప్పనూ లేదు అందులో మా తప్పేముంది".

"మీరు యిలాంటి పని చేస్తారని మేము కలగన్నామా! ఏదో లోక సహజంగా పోతారనుకున్నాం యింత మోసం చేస్తారని అనుకోలేదు "

"ఇందులో మిమ్మల్ని మోసం చేసిందేముంది? ఎవరి పరిస్థితులరీత్యా వాళ్ళు ప్రవర్తిస్తారు."

'అందుకు ఫలితం అనుభవించేది నేను రాఘవ కోపం తారాస్థాయికి చేరుకుంది 'నేను అని మీరు వేరుగా మాట్లాడకండి కొన్ని విషయాల్లో మేము సర్దుకుపోయినట్టే మీరూ సర్దుకుపోవాలి అప్పుడే పొందిక కుదురుతుంది" అంది సరోజ

"మీకిప్పుడేమి తక్కువైంది?"

'అడుగుతున్నారు కాబట్టి చెబుతున్నాను మీలాంటి వాళ్లను ఎవరు పెళ్లి చేసుకుంటారు చెప్పండి. ఆస్తిపాస్తులూ లేవు ఉద్యోగమూ సామాన్యమైంది అయినా నేను ఒప్పుకున్నాను ఎందుకు? మీ సంసార పరిస్థితులను చూసాము కాబట్టి. వచ్చే కట్నంతో చెల్లెళ్ల పెళ్లిళ్ళు చేసే సంస్కార వంతులని సంబరపడ్డాను. అందుకే నాకు తగిన భర్తని అంగీకరించాను నిజానికి మీకంటే అందమైన వాళ్ళూ మంచి ఉద్యోగము చేసే వాళ్ళూ

## ఆది మానవులు

అప్పుడు –
అనాగరికత చేత
మనం బట్టల్లేకుండానే
తిరిగాం!
ఇప్పుడు –
నాగరికత పేరిట
మనల్ని మనమే
బట్ట బయలు చేస్కుంటున్నాం!!

–ఆదిరెడ్డి మావుళ్ళు

## తానొకటి తలిస్తే ...

కోరి వచ్చారు కాని నేను తిరస్కరించాను కారణం?

వాళ్లకు మనలాంటి యింటి పరిస్థితుల పట్ల అవగాహన లేదు. అందుకే వాళ్ళు అర్థం చేసుకోలేరని నా భయం

"సరోజ నేను పూర్తిగా ఓడిపోయాను నేను కన్న కలలన్నీ మంచులా కరిగిపోయాయి నేను వూహించినది ఒకటి జగింది మరొకటి" రాఘవ క్రుంగిపోతూ అన్నాడు

ఏమండి మీరంతగా దిగులుపడవద్దు మేమున్న పరిస్థితులలో అంతకన్న గత్యంతరము లేదు మా నాన్న కట్నం యివ్వలేడు కట్నం యివ్వనిదే మీరు పెళ్లికి ఒప్పుకోరు అందుకే మా ఆఫీసులో లోను తీసుకున్నాను మహా అయితే నెలకు రెండు వందలు కట్ అవుతుంది పోతే మా అమ్మా నాన్నల విషయం కని పెంచి ఉద్యోగస్తురాలిగా చేసిన తల్లిదండ్రుల రుణం ఆ మాత్రం తీర్చుకోకపోతే పుట్టగతులుండవు'

సరోజా! ఇందులో నీ తప్పేమిలేదు. నేను చెల్లెళ్ల పెళ్లిళ్ళు చెయ్యాలి వేలకు వేలు కట్నంగా ధారపొయ్యాలి పైపెచ్చు వివాహ ఖర్చులు తతంగాలు. ఈ వుచ్చు నుండి బయటపడాలి అందుకే నేను యిలాంటి ఆలోచన చేశాను నీ జీతంతో ఆ అప్పులు తీర్చవచ్చునుకున్నాను. కాని నువ్వు అప్పులతోనే అత్త గడప తొక్కావు మీరూ మాలాంటి వాళ్లే కట్నం అనే బెడద లేకుంటే నువ్వూ అప్పుతో వచ్చేదానివికాదు నేనూ చెల్లెళ్ల పెళ్లిళ్లకి అప్పులు చేసేవాణ్ని కాదు ఈ మధ్యతరగతి కుటుంబాలింతే'

'అందునా మగవాళ్లదే పై చెయ్యి మీకేం మగ మహారాజులు మన యిద్దరి జీతాలతో అటు అప్పులు యిటు అప్పులు తీరుస్తారు కాని యింటా బయటా పనితో నేనేగా సతమతమయ్యేది అదే ఉద్యోగం లేందయితే హాయిగా యిల్లు చక్కబెట్టుకుంటుంది. యిన్ని బరువు బాధ్యతలుండవు అసలు ఆడదానికి చదువు వుండాలో వద్దో నాకు తెలియదు కాని ఉద్యోగము మాత్రం ఉండకూడదు అంటూ సరోజ చాలా బాధగా అంది

